# ప్రజాశక్తి

సోమవారం 29 సెప్టెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# విశాఖ ఉక్కును బలహీనపరిచే కుట్రలు

- అందుకే మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు
- ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటుపరం దారుణం
- సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ

**ప్రజాశక్తి - అనకాపల్లి**

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే కుట్రలో భాగంగానే నక్కపల్లిలో ప్రైవేట్ ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు జరుగుతోందని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ పేర్కొంది. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ప్రాధాన్యమిస్తూ, ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతోందని తెలిపింది. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించింది. సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సమావేశం ఆదివారం అనకాపల్లి పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు అధ్యక్షతన జరిగింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని మీడియాకు విడుదల చేశారు.

విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో 32 మంది ప్రాణ త్యాగంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పడిన విషయాన్ని సిపిఎం నాయకులు గుర్తుచేశారు. నిర్వాసితులు ప్లాంట్ కోసం సర్వస్వం త్యాగం చేశారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి పార్టీలైన టిడిపి, జనసేనల అజెండాను ప్రతిపక్ష వైసిపి అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఒకవైపు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని ప్రకటించిన వైసిపి మరోవైపు నక్కపల్లిలో ప్రైవేట్ స్టీల్ ప్లాంట్‌కు అన్ని రకాల అనుమతులు, రాయితీలు, సౌకర్యాలు ఇవ్వాలని ఈ నెల 27న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో తెలియజేసిందన్నారు. టిడిపి, వైసిపిలకు తేడా ఏమీలేదని ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజల మూలధనంతో నిర్మించిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను బలోపేతం చేయాల్సింది పోయి నష్టాల్లోకి నెట్టడం, సొంత గనులు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి అన్ని రకాలుగా సహాయ, సహకారాలు ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటని అడిగారు. స్వయాన అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, విశాఖ ఎంపీ శ్రీ భరత్, కేంద్ర ఉక్కు సహాయక మంత్రి శ్రీనివాస్ వర్మ ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్ రావడం వల్ల అనకాపల్లి జిల్లా రూపు రేఖలు మారనున్నాయని అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజాధనాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడమే వీరి విధానంగా ఉందన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్ లాభాల కోసం తప్ప ఆ ప్రాంతం ప్రజల అభివృద్ధి కోసం కాదని పేర్కొన్నారు. శనివారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో వారికి అనుకూలంగా వున్నవారితోనే మాట్లాడించారని, నిర్వాసితులెవరినీ భాగస్వామ్యం చేయలేదని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై జరుగుతున్న ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొట్టాలని, ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# ఆహార కల్తీదారులపై కఠిన చర్యలు

- ఇప్పటికే తనిఖీలు ముమ్మరం చేశాం
- 'ప్రజాశక్తి'తో విశాఖ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.కల్యాణ్ చక్రవర్తి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** జిల్లాలో కల్తీ ఆహారం తయారు చేసి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.కల్యాణ్ చక్రవర్తి అన్నారు. ఇటీవల ఆయన అనంతపురం నుంచి విశాఖకు బదిలీపై వచ్చారు. ఇక్కడి పరిస్థితులను గమనించారు. 'ప్రజాశక్తి'తో పలు విషయాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**మీ పరిధిలోకి ఏయే విభాగాలు వస్తాయి ?**

ఆహారం తయారు చేసి విక్రయించే వారందరూ మా పరిధిలోకి వస్తారు. స్టార్ హోటళ్ల నుంచి రోడ్డు పక్కన ఆహారం అమ్మే వారి వరకూ ఆహారాన్ని తయారు చేసే వారందరిపై మాకు తనిఖీలు నిర్వహించే అధికారం ఉంది.

**ఇటీవల ఎక్కడెక్కడ దాడులు నిర్వహించారు ?**

ఆగస్టు 1, 2 తేదీల్లో లీగల్ మెట్రాలజీ డిపార్టుమెంట్‌తో కలిసి జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించాం. మొత్తం 80 శాంపిళ్లను పరీక్షలకు పంపాం. 29 శాంపిళ్లలో ఆహారం కల్తీ జరిగింది. అందులో 15 శాంపిల్స్ ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి. వాటిపై కోర్టులో కేసులు ఫైల్ చేశాం. అభియోగాలు నిర్ధారణైతే మూడు నెలలు జైలు శిక్షతోపాటు రూ.మూడు లక్షల వరకు జరిమానా విధించే అవకాశముంది. మిగిలిన 14 శాంపిల్స్‌కు సంబంధించి జాయింట్ కలెక్టర్ ద్వారా చర్యలు తీసుకుంటాం. ఆ కేసులకు సంబంధించి ఆయన పరిధిని బట్టి, నేర తీవ్రతను బట్టి రూ.5 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

**విశాఖలో ఆహార భద్రత ప్రయోగశాల ఏర్పాటు ఎంతవరకూ వచ్చింది?**

ఆహార భద్రత ప్రయోగశాల నిర్మాణం మా కార్యాలయం ప్రాంగణంలోనే జరుగుతోంది. ఇది తుది మిగతా 2లో..

## ముగిసిన జాతీయ చౌక్‌బాల్ పోటీలు

వార్త 3లో..

## యువత ఉపాధికి ఉద్యమిద్దాం : డివైఎఫ్ఐ

వార్త 8లో..

## నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా

వార్త 8లో..

పారిశ్రామిక ప్రగతిపై

# బాబువి పచ్చి అబద్ధాలు

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మీడియాతో మాట్లాడుతున్న అమర్‌నాథ్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** కూటమి ప్రభుత్వ పాలనలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోందని సిగ్గులేకుండా సిఎం చంద్రబాబు అసెంబ్లీ వేదికగా పచ్చి అబద్ధాలు మాట్లాడారని వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. ఆదివారం విశాఖ వైసిపి నగర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత పదహారు నెలలుగా రాష్ట్రంలోని పారిశ్రామిక రంగం చీకటి రోజులను చూస్తోందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో జరుపుతున్న అరాచక పాలన చూసి ఎపి వైపు ఒక్క పారిశ్రామికవేత్త కూడా వచ్చేందుకు సిద్ధంగా లేరన్నారు. గతంలో పలువురు పారిశ్రామికవేత్తలతో మాజీ సిఎం జగన్ చేసుకున్న ఒప్పందాలను, తీసుకువచ్చిన పరిశ్రమలను తమ ఘనతగా చెప్పుకోవడానికి చంద్రబాబుకు సిగ్గులేదా అని ప్రశ్నించారు.

మనువాద.. కార్పొరేట్

# దోపిడీ, అణచివేతలపై ఉద్యమాలు

పౌర ప్రజా సంఘాల వేదిక సదస్సులో వక్తలు

సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ, వేణుగోపాల్, ప్రసాద్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** దేశంలో మనువాద.. కార్పొరేట్ దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు అవసరమని పలువురు వక్తలు అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం, భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని 'మనువాద కార్పొరేట్ ఫాసిజం మూలాలు - ప్రజా ఉద్యమ కర్తవ్యాలు'పై పౌర ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.జగన్ అధ్యక్షతన మొదటి సెషన్‌లో 'చరిత్రలో మనువాద దోపిడీ, అణచివేత వ్యతిరేక సామాజిక ఉద్యమాలు - దళిత, బహుజన, మహిళ, మైనారిటీ పోరాటాల పాత్ర' అంశంపై చర్చ జరిగింది. వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ బ్రాహ్మణవాదం మనువాదం నిచ్చెన మెట్ల వ్యవస్థ మార్గాన్ని ఏర్పరిచిందని, ఈ విషయం అందరికీ తెలిసినా, ఈ తప్పుడు భావనను ప్రస్తుత పాలకులు ప్రవేశపెడుతున్నారని దుయ్యబట్టారు. దీనిపై పోరాడిన చరిత్ర భారతదేశానికి ఉందన్నారు. మనువాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలన్నిటినీ ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం మిగతా 2లో..

## మొదటి పేజీ తరువాయి..

### ఆహార కల్తీదారులపై కఠిన చర్యలు

దిశకు చేరుకుంది. వచ్చే నెలలో ఉన్నతాధికారులతో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

**ఆహార విక్రయదారులు పాటించాల్సిన కనీస నియమాలేంటి ?**

ఆహార పదార్థాల తయారీదారులు, అమ్మకందారులు పరిశుభ్రమైన ప్రదేశాల్లో వాటిని తయారు చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే వారవుతారు. చాలా ప్రాంతాల్లో అవగాహనా రాహిత్యం మూలంగానే ఎక్కువుగా అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాల తయారీ జరుగుతోంది. దీనిపై అవగాహన కల్పించేందుకు సెమినార్లు, సదస్సులు నిర్వహించనున్నాం. కొంతమంది తయారీదారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కల్తీ లేదా పాడైన ఆహారం అమ్మకాలు చేస్తున్నారు. తయారీదారులకు థర్డ్ పార్టీ సంస్థలు శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. తద్వారా శిక్షణ పొందిన నిపుణులైన వ్యక్తుల ద్వారా ఆహారాన్ని తయారు చేస్తే ప్రజల ఆరోగ్యాన్ని మరింత కాపాడేవారవుతారు.

**బయట ఆహారం తినేవారు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి ?**

బయట ఆహారం తినేవాళ్లు ప్రధానంగా రంగులు లేని ఆహార పదార్థాలకు ప్రాధాన్యతనివ్వాలి. అదేవిధంగా ప్యాకేజీ ఫుడ్ తినేవాళ్లు ఎక్స్పైరీ డేట్‌లను విధిగా చూసి, కొనుగోలు చేయాలి.

**ఆహార విక్రయదారులకు మీరిచ్చే సూచనలేంటి ?**

పరిశుభ్రమైన ప్రదేశాల్లో వండిన ఆహారాన్ని మాత్రమే విక్రయించాలి. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, ఇతర పదార్థాలు వినియోగించకుండా స్వచ్ఛమైన ఆహారాన్ని అందించేందుకు ప్రయత్నించాలి. శిక్షణ పొందిన వ్యక్తులచే ఆహారం తయారు చేయించడం మంచిది. ఆహారాన్ని తయారు చేసేటప్పుడు తాజా ఆహార పదార్థాలను, ముడి సరుకులను మాత్రమే వినియోగించాలి. కల్తీ ఆహారం తయారు చేసే వారిపై తనిఖీలు, దాడులు ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉంటాయి. ఇది నిరంతర ప్రక్రియ.

### మనువాద.. కార్పొరేట్ దోపిడీ, అణచివేతలపై ఉద్యమాలు

ఉందన్నారు. వీటిపైనే క్రీస్తుపూర్వం ఆరు, ఐదు శతాబ్దాల్లో గౌతమ బుద్ధుడు ఉద్యమించారన్నారు. 1910లో ఓ అమెరికన్ రచయిత భారతదేశంలోని ఓ వితంతువు బ్రాహ్మణుల వేధింపులు భరించలేక క్రైస్తవ మతంలోకి ఎలా మారిందో పుస్తకం ద్వారా తెలియజేశారన్నారు. భారత ఖండంలో మనువాదజాలంపై ఉద్యమించింది బుద్ధుడని అన్నారు. తర్వాత మహావీరుడు, దానికి ముందు చార్వాకులు, లోకాయుతలు బ్రాహ్మణ మనువాదంపై ఉద్యమించారన్నారు. ఆదివాసీ, జాతుల ఉద్యమాలు, మనువాద, కార్పొరేట్ శక్తుల దాడులు - కర్తవ్యాలు అన్న అంశంపై సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పూలే పోరాటాలను వివరించారు. పోలమాంబ, నూకాలమ్మ, పైడిమాంబ తదితర ఆలయాల్లో స్థానికులు, మూలవాసులు పూజా కార్యక్రమాలు నిర్వహించేవారని తెలిపారు. తరువాత కాలంలో వాటిని ఆక్రమించి బ్రాహ్మణులు పూజారులుగా వచ్చారని వివరించారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ పాత్రపై ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిస్ట్ పార్టీలు సామాజిక సాంస్కృతిక పోరాటాలను కొనసాగించాలంటూ కేరళలో కమ్యూనిస్ట్ నేత ఎకె.గోపాలన్ నిర్వహించిన పాత్ర ఈ విషయంలో కొనియాడాల్సిందేనన్నారు. దళితులను గుడుల్లోకి రానివ్వకుండా చేసిన వారిపై పేదలు ఎదురు తిరిగేలాగా సాంఘిక, రాజకీయ విప్లవోద్యమాన్ని నడిపారన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ నిజ స్వరూపం, రాజ్యాంగ ఉల్లంఘనలు, ఉద్యమ శక్తుల కర్తవ్యం అన్న అంశంపై ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ అబద్ధంలో పుట్టి అబద్ధంలో పెరిగి, అందరినీ తప్పుదారి పట్టిస్తూ ముందుకు వెళ్తున్న సంస్థ అని తెలిపారు. అధికారాన్ని చేతిలో పెట్టుకొని తమకు రాజకీయాలు లేవని చెప్పుకునే సంస్థ ఏదైనా ఉందంటే అది ఆర్‌ఎస్‌ఎస్ మాత్రమేనన్నారు. వాజ్‌పాయి నుండి మోడీ వరకు ప్రధాన మంత్రులుగా ఉండి కూడా తాము ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లమని చెప్పుకోవడానికి ఏనాడూ వెనకాడలేదన్నారు. కానీ ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం తమకు రాజకీయాలతో సంబంధం లేదని చెబుతోందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వారు దేశభక్తి గురించి మాట్లాడుతారుగానీ.. వారికి లేనిదే అదని ఎద్దేవా చేశారు. గతంలో బ్రిటిష్ వాడి భక్తి, నేడు అమెరికా భక్తి మాత్రమే ఆర్‌ఎస్‌ఎస్‌కు ఉన్నాయన్నారు. వారు అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి సాధించామని చెప్పుకునేందుకు ఒక్క అంశం కూడా లేదన్నారు. జాతీయోద్యమంలో ఉద్యమకారులెవరూ క్షమాపణ పత్రం రాసి బయటకు రాలేదుగానీ సావర్కర్ లాంటి వ్యక్తి క్షమాపణ పత్రం రాసి బయటకు వస్తే అతనిని మోడీ ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తించిందని తెలిపారు. అబద్ధాలకోరు ఆర్‌ఎస్‌ఎస్‌ను అందరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సదస్సులో పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టియు నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, పౌర ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### లియోరా ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ :** లియోరా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆల్ ఇండియా రేడియో సమీపంలోని జగన్నాథ ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా వివిధ ఆరోగ్య సమస్యలు నివారణ సంరక్షణ యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించారు. శిబిరానికి ప్రముఖ కార్డియోథోరాసిక్ సర్జన్ డాక్టర్ సుజిత్‌కుమార్ మొహంతి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సంయుక్త పాల్గొన్నారు. ట్రస్టీ సభ్యులు హసికేశ్ బిసోయి, మధుస్మిత మొహంతి, త్రిప్తిమయి ఖుంటియా హాజరయ్యారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

# ఎయుపై అధికార రాజకీయ పెత్తనం !

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

ఎంతోమంది ఉన్నత విద్యావంతులను తీర్చిదిద్దిన ఆంధ్రా యూనివర్శిటీపై రాష్ట్రంలోని అధికార తెలుగుదేశం పార్టీ తనదైన శైలిలో రాజకీయం చేయాలని చూస్తున్నట్లు విద్యార్థి మృతితో వెల్లడైంది. ఊపిరాడక, సకాలంలో వైద్యమందక బిఎడ్ రెండో సంవత్సరం విద్యార్థి మణికంఠ మృతిచెందితే, అతడు ఫిట్స్‌తో మృతిచెందినట్లు లోకేష్ ప్రకటన చేయడం శోచనీయం. ఎయు ఆసుపత్రిలో వైద్యులు, మందులు, వైద్య సిబ్బంది లేకపోవడం ఒకటైతే అంబులెన్సులో ఆక్సిజన్ సైతం లేకుండా చేసిన ప్రభుత్వ గొప్ప విధానం ఆ విద్యార్థి మృతికి నిలువుటద్దంగా ఉంది. ఎయు యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల విద్యార్థి మృతిచెందాడంటూ రాజకీయాలతో నిమిత్తం లేకుండా విద్యార్థులంతా వర్సిటీలో భారీ ఆందోళనకు దిగితే మంత్రి లోకేష్ వారిని 'రాజకీయాలు' చేయొద్దంటూ బెదిరించే దాకా వెళ్లారు.

**యూనివర్శిటీల అభివృద్ధిని ఎవరైనా అడ్డుకున్నారా ?**

రాష్ట్రంలోని యూనివర్శిటీలను అభివృద్ధి చేస్తున్నామని, దేశంలోని టాప్ వంద యూనివర్శిటీల్లో మొదటి ర్యాంకుకు తేవాలని చూస్తున్నామని అసెంబ్లీ వేదికగా మంత్రి నారా లోకేష్ ఈ ఘటనపై ఉపన్యాసం చేశాడు. వాస్తవం ఏమిటి ?. ఏయూలో ఏం జరుగుతుందో తెలుసుకునే ప్రయత్నం ఆయనగానీ, ప్రభుత్వంగానీ చేయడం లేదు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటినా యూనివర్శిటీలో ఒక్క అధ్యాపకుని పోస్టునూ భర్తీ చేయలేదు. ఈ ప్రభుత్వం యూనివర్శిటీలను అభివృద్ధి చేస్తామని చెప్పి విద్యార్థులు చదువుకోకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్

షిప్ ఇవ్వడం ఆపేసింది. ఎయులోని కొన్ని డిపార్టుమెంట్లు సింగిల్ ప్రొఫెసర్లతో నడుస్తున్నాయంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు. మొత్తం 50 అధ్యాపక విభాగాల్లో 100 శాతానికి 23 శాతం పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. మిగతావన్నీ గెస్ట్ లెక్చరర్‌లు, డెయిలీ వేజెస్ వారితో తూతూ మంత్రంగా నడిపిస్తోంది కూటమి ప్రభుత్వం. క్లాసులు జరగకుండా ఆందోళన చేయడం ఏమిటి ? ఏయూ కార్యకలాపాలను అడ్డుకోవడం ఏమిటి ? అంటూ మంత్రి లోకేష్ చిర్రుబుర్రులాడడం విద్యార్థిలోకంలో తీవ్ర ఆగ్రహానికి కారణంగా నిలుస్తోంది.

**విద్యార్థులవి న్యాయమైన డిమాండ్లే..**

రోజూ ఇచ్చే భోజనం, వైద్య సదుపాయాల్లో తీవ్ర నిర్లక్ష్యంపై ఎయు విద్యార్థిలోకం పోరుబాట పట్టింది. వర్సిటీ యాజమాన్యం విఫలం కావడంతో ఈ నెల 26న విసి రాజీనామా చేయాలంటూ పెద్దపెట్టున నినదించింది. విద్యార్థి మరణంతో ఒక ఆంగ్ల పత్రికలో ఎయు యాజమాన్యం ఆసుపత్రిలో కాంట్రాక్టు బేసిస్ డాక్టర్, నర్సు పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం అన్నింటికంటే విడ్డూరం. అది కూడా రూ.10 వేలకే డాక్టర్ వస్తాడా ?. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి ఇంతకంటే నిదర్శనం ఏమిటి?. కళ్లెదుటే విద్యార్థులకు ప్రభుత్వ నిర్లక్ష్యాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అత్యధిక మంది విద్యార్థినులు సైతం ఈ సారి ఆందోళనలో పాల్గొన్నారు.

# ఘనంగా వరల్డ్ హార్ట్ డే వేడుకలు

మాట్లాడుతున్న సిపి శంకబ్రత బాగ్చి

**ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్:** నగరంలోని ఆర్‌కెబీచ్‌లో ఆదివారం ఎంజిఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్ హోస్ట్స్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'డోంట్ మిస్ ఎ బీట్' అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమాన్ని, కాళీమాత ఆలయం నుండి వైఎంసిఎ వరకూ చేపట్టారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ గుండెజబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించుకో వాలని సూచించారు. డాక్టర్ కె.దామోదరావు, డాక్టర్ ఎం.భాస్కరరావు, డాక్టర్ ఎం.ఎన్.రాజు, డాక్టర్ శిరీష, డాక్టర్ఎల్.హరితకుమారి, తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ గిరిబాబు నాదెళ్ల, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాఘవేంద్ర కుమార్ గుడ్ల, ఆసుపత్రి నర్సులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**గుండె సమస్యలపై అవగాహన**

**ప్రజాశక్తి -గాజువాక :** అంతర్జాతీయ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుండె సమస్యలపై ఆదివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కిమ్స్ ఐకాన్ కార్డియాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ గౌరీశంకర్‌రెడ్డి మాట్లాడుతూ, వయసుతో సంబంధం లేకుండా పెరుగుతున్న గుండె సమస్యలకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సిఐ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ, జనసామాన్యంలో హృదయ సంబంధిత వ్యాధులు పెరుగుతున్న ప్రమాదం గురించి అవగాహన కల్పించడం అవసరమని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కార్డియాలజీ వైద్యులు డాక్టర్ నారాయణరాజు, డాక్టర్ సాయిమణికందన్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్, ఎంవిపికాలని:** కిమ్స్ హాస్పిటల్స్ సీతమ్మధార శాఖ ఆధ్వర్యంలో గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఆర్‌కె బీచ్‌లో వాక్‌థాన్ నిర్వహించారు. హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.బి.విజయ్‌కుమార్, సిఇఒ డాక్టర్ శ్రీధర్, కార్డియాలజీ విభాగానికి డాక్టర్ గణేష్ కాశీనాథుని, డాక్టర్ గరికపాటి మహేష్ పాల్గొన్నారు

**IN THE COURT OF HON'BLE FAMILY COURT AT VISAKHAPATNAM**
**F.C.O.P. 644/2025**

Between:
Smt. Kiladi Lalitha ...Petitioner
And
Sri Kiladi Venkata Siva Pratap ...Respondent

**NOTICE**

To,
**The Respondent:**
**Sri Kiladi Venkata Siva Pratap,**
S/o. Kiladi Venu, Hindu, Aged about 37 years, R/o. D. No. 29-44-15, 2nd Floor, Narain Trading Building, Dhobhi Street, SBI Colony, Daba Gardens, Visakhapatnam-530020.

Take notice that petitioner filed the above OP against you for grant of divorce on the file of Hon'ble Family Court, Visakhapatnam. The above matter stands posted to **20-11-2025** at **10.30 A.M** for your appearance. You are therefore hereby summoned to appear before the captioned Court either personally or through your Advocate, and in case of your failure, the matter will be decided exparte.

(By Order of the Hon'ble Court)
**P. T. Madhav & D. L. Sudha,**
Advocates
MIG. 238, Madhavadhara
Visakhapatnam-530018.
Cell: 9848257381

**మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**E.P.3/2024, O.S.4/2012**

Between:
చింత కృష్ణ వగైరాలు ......D.Hrs
And:
చింత గోపాలం వగైరాలు ......J. Drs
To:
**ప్రతివాది నెం.12 :** చింత అప్పలనాయుడు, S/O. లేటు గోపాలం, వయస్సు 50 సం.లు, డోర్ నెం.1-C-85, శాంతిగిరి కాలనీ, గాజువాక, విశాఖపట్నం.
**ప్రతివాది నెం. 14:** చింత లక్ష్మణ, S/O. లేటు గోపాలం, వయస్సు 44 సం.లు, డోర్ నెం. 1-45/a, శాంతిగిరి కాలనీ, గాజువాక, విశాఖపట్నం.

పై నెంబరు కేసులో D.Hrs ఆస్తి డెలివరీ కొరకు ఇందలి J.Drsపై ప్రతివాదులు పై కోర్టులో దాఖలు చేయగా శ్రీ కోర్టువారు J.Drs 12 మరియు 14 హాజరు నిమిత్తము **తేది. 16.10.2025కి** వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా దినమున మీరు స్వయముగాగాని, వకీలు ద్వారా గాని పై తేదీన **ఉదయం గం.10.30ని.లకు** పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేనియెడల మీపై పరోక్షమున తీర్మానించబడని ఇందుమూలముగా మీకు తెలియచేయడమైనది.

పై కోర్టువారు ఆర్డర్ ప్రకారం.

ఇట్లు
**M.సింహాచలం**
న్యాయవాది, బొబ్బిలి.
సెల్ నెం. 9440963385

**మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**I.P.No.3/2025**

Between:
శ్రీమతి పెరుగు అరుణ జ్యోతి .....పిటిషనరు
And:
ఇప్పిలి సరస్వతి వగైరాలు ....రెస్పాండెంట్లు
To:
**1) Respondent No.13:** దామెర సత్యవతి, W/o. రామచంద్రరావు, వయస్సు 70 సం.లు, ప్లాట్ నెం. 101, MVV హార్మొనీ, ఎండాడ, విశాఖపట్నం.
**2) Respondent No.14:** పెరుగు పార్వతి, W/o. లేటు అప్పారావు, వయస్సు 62 సం.లు, కావ్య హాస్పిటల్ వెనుక, ఓల్డ్ డైరీ ఫారం, డోర్ నెం.4-336/4, సాయి నిలయం, సుందర్ నగర్, విశాఖపట్నం.

పై నెంబరు పిటిషనులో పిటిషనరు insolventగా డిక్లేర్ చేయుట కొరకు IP పిటిషను పై కోర్టులో దాఖలు చేయగా శ్రీ కోర్టువారు రెస్పాడెంట్లు 13 మరియు 14 హాజరు నిమిత్తము **తేది.09.10.2025కి** వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా దినం మీరు స్వయముగాగాని, వకీలు ద్వారా గాని పై తేదీన ఉదయం **గం.10.30ని.లకు** పై కోర్టులో హాజరై యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేనియెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియచేయడమైనది.

పై కోర్టువారు ఆర్డర్ ప్రకారం.

ఇట్లు
**M.సింహాచలం**
న్యాయవాది, బొబ్బిలి.
సెల్ నెం. 9440963385

# రామకృష్ణాపురం వాసులకు పట్టాలు మంజూరు చేయాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్

**ప్రజాశక్తి - ఆరిలోవ :** జివిఎంసి 13వ వార్డు పరిధి కేంద్ర కారాగారం ఎదురుగా ఉన్న రామకృష్ణాపురంలో నివాసం ఉంటున్న సుమారు 600 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం 13వ వార్డు శాఖ ఆధ్వర్యాన రామకృష్ణాపురంలో పట్టాలు సాధన కోసం ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, గత 40 ఏళ్లుగా ఈ ప్రాంతంలో స్థిర నివాసాలు ఏర్పాటుచేసుకున్న సుమారు 600 కుటుంబాలకు నేటికి ఇళ్ల పట్టాలు ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రాజకీయ పార్టీలు తమ అవసరాలకోసం గ్రామ ప్రజలను ఉపయోగించుకుంటున్నారే తప్ప వారి సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. గత 40 ఏళ్లుగా పట్టాలు మంజూరు చేయాలని దరఖాస్తులు పెట్టుకున్నా ఇవ్వడం లేదని తెలిపారు. గతంలో బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణ క్రమంలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు కట్టించి ఇస్తామని, మిగిలిన వారికి పట్టాలు ఇస్తామని నాటి ప్రభుత్వం, జివిఎంసి అధికారులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన వారికి ఎస్ఎస్ఎన్ నగర్ కాలనీలో ఇళ్లు ఇచ్చారని తెలిపారు. 2015లో 296, 2017లో 388 జిఒల ప్రకారం పట్టాలు ఇస్తామని మీటింగ్‌కు తీసుకెళ్లి ఇవ్వకుండా మోసగించారని గుర్తు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా పట్టాలు ఇవ్వకుండా ద్రోహం చేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక జిఒ 30 ప్రకారం 150 చదరపు గజాల స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఉచితంగా

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్

పట్టాలు మంజూరు చేస్తామని చెప్పడంతో 2025 ఏప్రిల్ 22న దరఖాస్తులు చేసుకున్నారని, అయినా ప్రభుత్వం పట్టాలు ఇచ్చేందుకు నిరాకరిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఈ ప్రాంతం వాటర్ క్యాచ్‌మెంటు ఏరియాలో ఉందని, అందుకే పట్టాలు ఇవ్వడం కుదరదని అధికారులు, ప్రభుత్వం వాదిస్తోందని, అయితే నీటి సామర్థ్యం కలిగిన ప్రాంతంలో బిఆర్‌టిఎస్ రోడ్డు ఎలా వేసారని, చుట్టు పక్కల భవంతులకు ఎలా అనుమతులు ఇచ్చారని, రైల్వే జోన్‌కు స్థలం ఎలా కేటాయించారని ప్రశ్నిస్తే అధికారులు వద్ద సమాధానం లేదన్నారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ చొరవ తీసుకొని పట్టాలు మంజూరు చేయాలన్నారు. లేని ఎడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు పి.శంకర్, వార్డు శాఖ కార్యదర్శి ఐసి.నాయుడు, స్థానిక నాయకులు ఇ.ఆదినారాయణ, చిన్నారావు, బంగారాజు, బుకారి కుమారి, నాగేశ్వరరావు, దుర్గ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన జాతీయ చౌక్‌బాల్ పోటీలు

**ప్రజాశక్తి-ఆనందపురం :** పాలవలసలోని ఆసెంట్ స్కూల్‌లో జరిగిన జాతీయ స్థాయి చౌక్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. విశాఖపట్నం సిపి శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ పోటీలలో 22 రాష్ట్రాల నుండి 32 టీములు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో ఢిల్లీ టీం విజేతగా మహారాష్ట్ర రన్నరప్, అసోం తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో పశ్చిమబెంగాల్ విజేతగా, మహారాష్ట్ర రన్నరప్, అసోం తతీయ స్థానంలో నిలిచాయి.

విజేతలకు సిపి శంఖబ్రత బాగ్చి, కోరాడ రాజబాబు బహుమతులు అందజేశారు. మూడు రోజుల పాటు పోటీలను నిర్వహించిన కోచులు, విద్యార్థులను ఆసెంట్ స్కూల్ ప్రిన్సిపల్ కొలగాని శంకరరావు, డైరెక్టర్ బంగారు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

## వైసిపి గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునిగా రాంబాబు

**ప్రజాశక్తి -ఆనందపురం :** ఆనందపురం మండలం గిడిజాల గ్రామానికి చెందిన శినగం రాంబాబును వైసిపి భీమిలి నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశం కల్పించిన సమన్వయకర్త మజ్జి శ్రీను, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపి పొండ్రంకి శ్రీను తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## భీమిలి వాణిజ్య విభాగం అధ్యక్షునిగా రాంజీ

**ప్రజాశక్తి- ఆనందపురం :** భీమిలి నియోజకవర్గ వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షునిగా మేడిశెట్టి రాంజీ నియమితులయ్యారు. ఈ పదవి అప్పగించినందుకు పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డికి, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీను, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, బంక సత్యం, మజ్జి వెంకటరావు, శినగం చినరావు రావు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా గాయత్రి డిగ్రీ కళాశాల ఫెస్ట్

సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులు

**ప్రజాశక్తి- ఆనందపురం :** ఆనందపురం బీసీ కల్లాలు రోడ్డులో గల గాయత్రి డిగ్రీ కళాశాల ఫెస్ట్ 2క25 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ స్వచ్ఛంద సేవకులు తమ్మిన నర్సింగరావు మాట్లాడుతూ, యువశక్తి శ్రమ మేధో శక్తిగా మారితే దేశ అభ్యున్నతి సాధ్యమని తెలిపారు. భారతదేశంలో అత్యధిక యువత ఉందని, దీన్ని సద్వినియోగం చేస్తే దేశం విశ్వ గురువుగా మారగలదని పేర్కొన్నారు. విజ్ఞాన్ విహార డైరెక్టర్ బాలి రవి, కళాశాల ప్రధానాచార్యులు దుక్క అప్పలరాజు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు పోతిన సూరిబాబు తదితరులు జీవితంలో సాధన, లక్ష్యంతో కూడిన చదువు, గురు-శిష్య సంబంధాల ప్రాముఖ్యతపై వ్యాఖ్యానించారు. కళాశాల కరస్పాండెంట్ ఎర్రజి వెంకట్రావు మాట్లాడుతూ, విద్యార్థుల్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో 2014లో కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బంటుబిల్లి సత్యనారాయణ, అధ్యాపకులు సిహెచ్ సునీత, కె.సోమేశ్వరరావు, టి.పద్మ, ఎస్.ప్రియాంక, రాజ్యలక్ష్మి, జి.లక్ష్మణరావు, తమ్మిన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి - ఆరిలోవ :** విశాఖ కేంద్రకారాగారం, విమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం కేంద్రకారాగారం పెరేడ్ మైదానంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేషస్పందన లభించింది. కేంద్రకారాగారంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సుమారు 18 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎం.మహేష్‌బాబు మాట్లాడుతూ, రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన సహచరులకు, జైలు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప పర్యవేక్షణాధికారి ఎన్.సాయిప్రవీణ్, జైలర్లు, కారాగారం సిబ్బంది, విమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మృదుల, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న జైలు అధికారులు, సిబ్బంది

# నేరాలు ఘోరాలు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**ప్రజాశక్తి - ఆరిలోవ :** హనుమంతువాక నుండి డెయిరీ ఫాం వెళ్లే జాతీయ రహదారిలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. ఆరిలోవ ఎస్ఐ శంకర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెదరుషికొండకు చెందిన అంబటి చైతన్య (29), అతని స్నేహితుడు మధుతో కలిసి బైక్‌పై కైలాసపురంలో ఉంటున్న బంధువులు ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. శనివారం అర్ధరాత్రి హనుమంత వాక జంక్షన్ దాటిన తర్వాత బస్టాప్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయారు. ఈ ప్రమాదంలో చైతన్య అక్కడికక్కడే మృతిచెందగా, మధు స్వల్ప గాయాలతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సిఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ శంకర్ యాదవ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ఒడిశా, చత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి సేకరించి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్న ముగ్గురిని ఆదివారం మహారాణి పేట పోలీసులు అరెస్ట్ చేశారు. సిఐ జి.దివాకర్ యాదవ్ కథనం మేరకు ఒడిశా, చత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలోని గోమంగి గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ అలియాస్ ప్రభ ఆ ప్రాంతంలోని గంజాయి సేకరించి లోచలి కుమారస్వామి, గోమంగి నాని బాబుకు ఎప్పటిలాగే ఇచ్చాడు. వారు ఇతర ప్రాంతాలకు గంజాయిని తరలించసాగారు. ప్రభ గంజాయి అక్రమ రవాణాలో ఆరితేరిన నేరస్తుడు. విశాఖ టూ టౌన్, పెందుర్తి, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస స్టేషన్లలో అతనిపై కేసులు ఉన్నాయి. అరెస్టయి, బెయిల్‌పై విడుదలై మళ్లీ అవే తరహా నేరాలు చేస్తున్నాడు. తాజా కేసులో ముద్దాయిలుగా ఉన్న కుమారస్వామి, నాని బాబులపై కూడా గంజాయి కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురిని చాకచక్యంగా పట్టుకొని అరెస్ట్ చేసిన సిఐ దివాకర్ యాదవ్, హెడ్ కానిస్టేబుళ్లు సురేష్, నాగేంద్ర, నందకిషోర్‌లను ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భవానీ భక్తులు మృతి

**ప్రజాశక్తి -నక్కపల్లి:** నక్కపల్లి మండలంలో దోసల పాడు గ్రామంలో భవాని భక్తుల మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి. కాలినడకన విజయవాడ వెళుతున్న భవానీ దీక్షాపరులపై కారు దూసుకెళ్లిన ఘటనలో ఇరువురు భవానీలు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. స్థానికుల కథనం మేరకు... మండలంలో దోసలపాడు గ్రామానికి చెందిన పక్కుర్తి శివ, పక్కుర్తి శ్రీను, పక్కుర్తి శేషులు తదితరులు దుర్గా భవాని దీక్ష చేపట్టి బుధవారం ఉదయం కాలినడకన విజయవాడ కొండకు బయలు దేరారు. పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్దకు వెళ్లేసరికి ఆదివారం ఉదయం వారిపై కారు దూసుకు వెళ్లడంతో పక్కుర్తి శివ, పక్కుర్తి శ్రీను సంఘటన స్థలంలోనే మృతి చెందగా, పక్కుర్తి శేషులు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుని కుటుంబ సభ్యులకు హోం మంత్రి అనిత తన సానుభూతిని తెలియజేశారు.

పక్కుర్తి శివ (ఫైల్)

పక్కుర్తి శ్రీను (ఫైల్)

## రైల్వే ట్రాక్ వద్ద గుర్తుతెలియని మృతదేహం

**ప్రజాశక్తి -గాజువాక :** హరిజన జగ్గయ్యపాలెం రైల్వే ట్రాక్ వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. సుమారు 60 సంవత్సరాలున్న పురుషుని మెడ, మొండెం రైల్వే ట్రాక్‌పై వేర్వేరుగా పడి ఉన్నాయి. ఆయన గ్రే కలర్ షర్ట్, బ్లాక్ కలర్ పాంట్ ధరించి ఉన్నారు. ఎవరైనా గుర్తిస్తే 9440796014, 9440904325 నెంబర్లను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

### ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్/ సీతమ్మధార : రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి నిబద్ధతతో కట్టుబడి గట్టిగా కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు అన్నారు. ఫెడరేషన్ నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే న్యూ కాలనీ సింకా గ్రాండ్‌లో నిర్వహించిన జర్నలిస్టుల దసరా సంబరాల్లో ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదని, ఇలా అయితే సమీప భవిష్యత్తులో జర్నలిస్టుల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో జర్నలిస్టుల సంక్షేమానికి మంచి ప్రాధాన్యత నిస్తూ, బాగా ప్రోత్సహిస్తున్నారని, మన రాష్ట్రంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని విచారం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కయిన అక్రిడిటేషన్ కార్డుల సాధనే జర్నలిస్టులకు తలకు మించిన భారంగా పరిణమించిందని ఆవేదన వ్యక్తంచేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలోనే విజయవాడ వేదికగా అతిపెద్ద భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని, అవసరమైతే జర్నలిస్టులతో కలిసి ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించడానికి అయినా తాను సిద్ధమేనని చెప్పారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, 60 సంవత్సరాలు నిండిన జర్నలిస్టులకు పెన్షన్లు ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చెయ్యాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ప్రభుత్వ పెద్దలకు, కూటమి నాయకులకు, అధికారులకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నృత్య భారతి డాన్స్ స్కూల్ అసోసియేషన్ అధినేత్రి కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హైదర్ ఆలీ సింకా, జర్నలిస్టు సంఘాల నాయకులు బి.ఈశ్వరరావు, జి.శ్రీనివాసరావు, ఈరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్, జగన్మోహన్, ఎ.సాంబశివరావు, డి.రవికుమార్, బండారు శివప్రసాద్, పక్కివేణు, నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

దసరా సంబరాల్లో మాట్లాడుతున్న ఆంజనేయులు

## డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం పరిధి రాంపురం వైసిపి కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ పార్లమెంటరీ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ, నాయకులు, కార్యకర్తలు కష్టపడి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వల్ల అన్యాయానికి గురవుతున్న కార్యకర్తల కోసం జగన్మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. తప్పుడు కేసులకు గురవుతున్న వారికి పార్టీగా అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు భగవాన్ జయరాం, ఉప్పిలి దేవిరాజు, మధుపడ అంజి, పైలా శ్రీనివాస్, కోతన రాము, గండి రవికుమార్, బోకం రామ నాయుడు, సబ్బవరపు ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం'

ప్రజాశక్తి -సీతమ్మధార : రాష్ట్రంలో ప్రస్తుతం రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, దీనివల్ల రాష్ట్ర ప్రజలతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖాదర్ భాషా ఆరోపించారు. జివిఎంసి 53వ వార్డు పంజాబ్ హోటల్ జంక్షన్ సమీపంలోని వైసిపి వార్డు కార్యాలయంలో ఆదివారం ముస్లిం సంఘాల ప్రతినిధులు ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అణిచివేసేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి క్యూ ఆర్ కోడ్‌తో రూపొందించిన డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను క్యూఆర్ కోడ్ డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలోకార్పొరేటర్ బర్కత్ ఆలీ, అబ్దుల్ బషీరుద్దీన్, కరీంభాషా, హసన్ షరీఫ్, ఐహెచ్ ఫారూక్, షౌకత్ ఆలీ, ముజీబ్, బబ్లీ, మక్బుల్, ఇబ్రహీం ఖలీల్ పాల్గొన్నారు.

## పాత్రికేయులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విధి నిర్వహణలో ఒత్తిడితో పనిచేసే పాత్రికేయులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో పాత్రికేయులు గుండెపోటుతో మరణిస్తున్న సంఘటనలు తీవ్రంగా కలచివేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పోలీస్ కమిషనర్ హాజరై మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్ మీడియా రావడంతో పాత్రికేయులకు పని ఒత్తిడి తీవ్రమైందని, దాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ మాట్లాడుతూ, ఈ నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు పదవిలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ నాగబోయిన నాగేశ్వరరావు, ప్రజాకవి, సీనియర్ జర్నలిస్ట్ మజ్జి దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## విలువైన వస్తువులు లాకర్లలో పెట్టుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : దసరా పండుగను పురస్కరించుకుని గ్రామాలకు వెళ్లే ప్రజలు విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలని ద్వారకా క్రైమ్ ఎస్ఐ వై.రాజు తెలిపారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌విటి జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సెలవులకు గ్రామాలకు వెళ్లే ఇంటికి తాళాలు వేసి, ఇంటి చుట్టు పక్క వాళ్లకి తెలియపరచాలని, వస్తువులను భద్రపరుచుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 112కి కాల్ చేయాలని సూచించారు.

## రౌడీ షీటర్లకు అవగాహన

ప్రజాశక్తి- ములగాడ : మల్కాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాపురం సిఐ అప్పారావు మాట్లాడుతూ, దోపిడీలు, దౌర్జన్యాలకు పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మూల మహేష్‌కు అభినందనలు

ప్రజాశక్తి-మాధవధార: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ యూనియన్ సెంట్రల్ ఆఫీస్ బేరర్‌గా ఎన్నికైన మూల మహేష్‌ను ఆదివారం పలువురు రైల్వే సంఘాల నేతలు, రైల్వే ఉద్యోగులు కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

# జగన్నాధరావు సేవలు మరువలేనివి



సిఐటియు జిల్లా కమిటీకి రూ.10 వేలు చెక్కును అందజేస్తున్న జగన్నాధరావు

ప్రజాశక్తి -గాజువాక : భెల్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఎస్.జగన్నాధరావు సేవలు మరవరానివని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. షీలానగర్‌లో ఆయన ఇంటి వద్ద ఆదివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. జగన్నాధరావు దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, సమాజంలో పదిమందికి ఉపయోగపడే పనులు చేసే వ్యక్తి జగన్నాధరావు అని తెలిపారు. ఆయన విరమణ ఉద్యోగానికే కాని, యూనియన్‌కు, పార్టీకి కాదని, వాటికోసం పనిచేయాలని కోరారు. పెదగంట్యాడలో అదాని సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తే కాలుష్యం పెరుగుతుందని, అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, బిహెచ్‌పివి ఉద్యోగిగా చేరిన జగన్నాధరావు సిఐటియు, సిపిఎం అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, బిహెచ్‌పివిని ఎల్ అండ్ టి సంస్థకు అమ్మాలని చూసినప్పుడు చేసిన పోరాటంలో జగన్నాధరావు, ఆయన భార్య చురుగ్గా పాల్గొనేవారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీకి రూ.10 వేలు విరాళాన్ని జగన్నాధరావు అందజేశారు. భెల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన సభలో ఎస్.జ్యోతీశ్వరరావు, కుమారమంగళం, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, వివిధ కంపెనీల సిఐటియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# చేసిన సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి -గాజువాక : ప్రతి మనిషికీ ఆయన చేసిన సేవలు గుర్తింపునిస్తాయని వైసిపి గాజువాక నియోజకవర్గం పరిశీలకులు తైనాల విజయ్ కుమార్ అన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో 33 సంవత్సరాలు సర్వీసు అందించి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన అండిబోయిన అప్పారావును ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా తైనాల విజయ్ కుమార్, తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్తులో సమాజానికి, పార్టీకి అప్పారావు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, ఇమ్రాన్, పార్టీ నాయకులు రాజాన వెంకట్రావు, మహమ్మద్ ఆలీ, బుజ్జి, పిట్ల రెడ్డి, అండిబోయిన సన్నీ పాల్గొన్నారు.

అప్పారావుకు సన్మానం చేస్తున్న తైనాల విజయ్‌కుమార్

## నేడు నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ పరిధిలో సోమవారం పలు వార్డుల్లో నీటి సరఫరా నిలుపుదల చేయనున్నట్లు వాటర్ సప్లై అసిస్టెంట్ ఇంజినీర్ కేదారినాథ్ తెలిపారు. సుందరయ్య కాలనీలోని వాటర్ ప్లాంట్ వద్ద మరమ్మత్తుల కారణంగా 70, 71, 72, 73, 74, 76, 64, 65, 86, 87 వార్డుల్లో నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

## ట్రాఫిక్‌పై అవగాహన

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ట్రాఫిక్‌పై అవగాహన కల్పించడానికి 'గాజువాక ట్రాఫిక్ సోల్జర్స్' పేరుతో కొత్తగా కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని రిటైర్డ్ పోలీస్ అధికారులు, ఎక్స్ సర్వీస్‌మెన్, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సభ్యులు, ట్రాఫిక్‌పై ఇంట్రెస్ట్ కలిగిన పౌరులతో ఏర్పాటు చేశారు. గాజువాకలో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి సరైన వ్యవస్థ కోసం పౌరుల సూచనలు, సలహాలు తీసుకోవడానికి, ట్రాఫిక్ రెగ్యులేషన్‌లో సేవల కోసం ఈ కార్యక్రమం చేట్టారు. ఎవరైనా ట్రాఫిక్ ద్వారా పబ్లిక్ సర్వీస్ చేయాలనుకునే వారూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి పని చేద్దామని ఆశించే వారు 'గాజువాక ట్రాఫిక్ సోల్జర్స్'లో జాయిన్ కావచ్చు. ఇది సేవలం సర్వీస్ మాత్రమే. దీనికి ఎటువంటి రెమ్యూనరేషన్ చెల్లించరని పోలీసులు తెలిపారు. పది రోజుల్లో కేవలం రెండు గంటలు మాత్రమే ట్రాఫిక్ పోలీసుతో కలిసి గాజువాక రోడ్లపై ట్రాఫిక్ రెగ్యులేషన్ సర్వీస్ చేయాలని, ఒక నెలలో మూడుసార్లు ఆరు గంటలు మాత్రం పోలీసులతో పాటుగా ట్రాఫిక్ విధుల్లో భాగస్వామ్యం కావాల్సి ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ పోలీసు విధుల్లో భాగస్వామ్యం కావాలనుకునేవారు గాజువాక ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ హుస్సేన్ (9440796018)ను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని పోలీసులు పేర్కొన్నారు.

## అన్నసమారాధన

ప్రజాశక్తి-ములగాడు : జివిఎంసి 60వ వార్డు పరిధి హనుమాన్ సంజీవ్ కాలనీలో గణేష్ సేవా సంఘం ఆధ్వర్యాన దసరా ఉత్సవాల్లో భాగంగా భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ అన్న సమారాధనను వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంగ వర్మ, ఉద్ద భాస్కర్, సూర్యారావు, ధర్మాల చిన్నారెడ్డి, భవానీరాజు, రమణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధనలో కార్పొరేటర్ పి.వి.సురేష్

# ఆర్ఇసిఎస్‌లో అవినీతి ప్రక్షాళన జరిగేనా?

కశింకోట ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కాలేజీ, అసెంబ్లీలో సమస్యను ప్రస్తావిస్తున్న కొణతాల

- అసెంబ్లీలో ఎమ్మెల్యే కొణతాల ప్రస్తావనతో మళ్లీ తెరపైకి..
- కూటమి సర్కారు స్పందన, చర్యలు, విచారణపై సర్వత్రా ఆసక్తి

**ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్** : ఆర్ఇసిఎస్‌లో అవినీతిపై అసెంబ్లీలో స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రస్తావనతో ఇన్నాళ్లు మరుగున పడినట్లు కనిపించిన ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. అసెంబ్లీ వేదికగా దీనిపై చర్చ జరగడంతో ఇప్పటికైనా ఈ సంస్థలో అవినీతిపై విచారణ జరిగి, ప్రక్షాళన జరుగుతుందా అని పలువురు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఆర్ఇసిఎస్‌లో భారీగా అవినీతి జరిగిందనే ప్రచారం జరిగింది. ఉద్యోగాల కల్పనతో పాటు నిధుల దుర్వినియోగానికి సంబంధించి అనేక ఆరోపణలు వినిపించాయి. అయితే అప్పటి ఎమ్మెల్యే పెద్దగా పట్టించుకోకపోవడంతో ఆ ఆరోపణలపై చర్యలు, విచారణ అటకెక్కినట్లు ప్రచారం జరిగింది. తాజాగా అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కొణతాల స్వయంగా ఆర్ఇసిఎస్ అవినీతిపైకమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఎపిఇపిడిసిఎల్‌లో విలీనం చేసిన సంస్థను మునుపటిలా సహకార రంగంలోనే నడపాలని కోరడంతో మళ్ళీ తెరపైకి వచ్చింది.

2021లో ఆర్ఇసిఎస్‌లో అవినీతి జరుగుతుందనే ఉద్దేశంతో ఎలక్ట్రిసిటీ రాయితీ ఇవ్వకుండా, సంస్థ వ్యాపార లావాదేవీలను ఎపిఇపిడిసిఎల్‌కు ఎపిఇఆర్‌సి రెగ్యులేటరీ కమిషన్ అప్పగించింది. అయితే అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిన యంత్రాంగం, దానిపై దర్యాప్తు చేసి తగు చర్యలు చేపట్టకుండా విచారణకు వచ్చిన ప్రతిసారీ హైకోర్టులో స్టే తెచ్చుకున్నట్లు అసెంబ్లీలో కొణతాల వాదించారు. అధికారులను మార్పు చేసినా అదే స్థాయిలో అవినీతి జరుగుతుందని ఎమ్మెల్యే ఆరోపణలతో అందరి దృష్టి మళ్లీ దీనిపై మళ్ళింది. సంస్థకు సంబంధించిన ఆస్తులు, డిపాజిట్లు ట్రాన్స్‌ఫర్‌తోపాటు సంస్థ నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగులకు 8 నెలలుగా జీతాలు ఇవ్వకుండా రోడ్డున పడేసారని ఎమ్మెల్యే కొణతాల ఆవేదన వెల్లగక్కారు. ఎపిఇపిడిసిఎల్ ఉద్యోగులు పనిచేయకుండా ఈ సంస్థ నుంచి జీతాలు తీసుకుంటున్నారని విమర్శలూ ఉన్నాయి.

ఈ నేపథ్యంలో కొణతాల లేవనెత్తిన అంశాలతో సంస్థ మనుగడ ఏంటనేది విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటేనే తేలనుందనే భావన వ్యక్తమవుతుంది. సహకార రంగంలో మునుపటిలా నిర్వహిస్తుందా? లేక ప్రస్తుతమున్న యథాస్థితిలో ఎపిఇపిడిసిఎల్‌లో పూర్తిగా విలీనం చేస్తుందా అనేది తేలనుంది. అవినీతిపై విచారణ కమిటీని ప్రభుత్వం నియమిస్తే, వాస్తవాలు బయట పడే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంస్థను దోచుకుని, దాని మనుగడను ప్రశ్నార్థకం చేస్తే, ఎంతటి వారినైనా శిక్షించాల్సిందే, సంస్థను పరిరక్షించాల్సిందేనని పలువురు అంటున్నారు. ఆర్ఇసిఎస్‌లో అవినీతిపై విచారణ కమిటీ వేయాలని అధికార కూటమికి చెందిన ఎమ్మెల్యే సమస్యను లేవనెత్తడంతో దీనిపై ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో, ఎటువంటి చర్యలు చేపడుతుందోనని పలువురు ఆసక్తిగా చూస్తున్నారు.

## హాకీ టోర్నమెంట్ ప్రారంభం

హాకీ క్రీడాకారులతో శ్రీనివాసరావు

**ప్రజాశక్తి - యలమంచిలి** : స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో ఆదివారం హాకీ లీగ్ టోర్నమెంట్ ప్రారంభమైందని జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ నరేష్ తెలిపారు. మూడు రోజులు జరిగే ఈ పోటీలు మంగళవారం సాయంత్రం ముగుస్తాయన్నారు. ఆరు క్లబ్ జట్లు పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో హాకీ జట్ల కెప్టెన్లతో పాలు క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు జివి రెడ్డి, మహేష్, రాంబాబు పాల్గొన్నారు. జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు పాల్గొని, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని టోర్నీని విజయవంతం చేయాలని కోరారు.

## సమస్యలపై మంత్రులకు వినతి

హోంశాఖ మంత్రి అనితతో మండల టిడిపి నేతలు

**ప్రజాశక్తి-ఎస్ రాయవరం** : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలను విజయవాడలో వారి పార్టీ గృహాల వద్ద ఎస్.రాయవరం మండల టిడిపి నాయకులు బోలిశెట్టి గోవిందరావు, సోమిరెడ్డి రాజు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ, మండల సమస్యలు, పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సమస్యలు వివరించారు. అలాగే రాష్ట్ర రవాణామంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఒఎస్‌డి ఎంఆర్‌జి నాయుడులను కలిసి, మండలంలోని గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించి, పెంచాలని కోరారు.

## దుర్గాలమ్మ ఘటాల ఊరేగింపు

**ప్రజాశక్తి- కె.కోటపాడు** : మండలంలోని చౌడువాడ గ్రామంలో ఆదివారం దుర్గాలమ్మ ఘటాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. దుర్గాభవానులు గ్రామ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, కుంచ మహేష్ ఆధ్వర్యంలో 500 మంది భవానీలు వివిధ వేషధారణలతో ఘటాలు మోస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనేక భక్తి పాటలు పాడుతూ, మేళతాళ ధ్వనులతో సందడి చేశారు.

## జిఎస్‌టి తగ్గింపులపై అవగాహన

కరపత్రాలిచ్చి అవగాహన కల్పిస్తున్న తహశీల్దారు మహేశ్వరరావు

**ప్రజాశక్తి - పాయకరావుపేట:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జిఎస్‌టి తగ్గింపుపై ప్రజలు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని తహశీల్దారు శివకోటి ఆది మహేశ్వరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని దుర్గానగర్ కాలనీలో పర్యటించారు. జిఎస్‌టి శ్లాబుల మార్పు, సవరణలతో ఏయే వస్తువులు ఎంతమేర ధరలు తగ్గాయో అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం జిఎస్టీ తగ్గింపు వివరాలతో ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను స్థానికులకు పంచారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి విజయలక్ష్మి, ఇఒపిఆర్డిఇ కుంచా డేవిడ్, పిఎల్ పురం, మంగవరం, కందిపూడి సెక్రటరీలు లగుడు అప్పల శివరామం, చిట్టూరి కొండారావు, ఆరుగుల గంగాధర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ ఆశయాలు ఆదర్శం

అచ్యుతాపురంలో నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు

**ప్రజాశక్తి -అచ్యుతాపురం** : భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమస్యలపై పోరాటం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ కె సోము నాయుడు యువకులకు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆదివారం మోసయ్యపేట గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సోము నాయుడు మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవిత చరిత్ర, స్వాతంత్ర్యపోరాట ఘట్టాలను వివరించారు. కార్మికులు, కర్షకులు, యువకులు, మహిళల సమస్యలపై ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో సిఐటియు యు రామకృష్ణ, అప్పారావు, పంచదార్ల తాతారావు, కె.శివ, ప్రకాష్, ప్రసాద్ రాజు, వెంకటేష్, చందు పాల్గొన్నారు.

**బుచ్చయ్యపేట** :మండలంలోని రాజాం పాలసెంటర్ వద్ద పిడిఎస్ఒ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 118వ జయంతి సభ నిర్వహించారు. వడ్డాది నాయుడు అధ్యక్షతన యూనియన్ అధ్యక్షులు ఎన్. భాస్కర్ తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు మరిస శివ, రొంగలి అప్పారావు, కోన మోహన్ విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

**విశాఖపట్నం** : కంచరపాలెంలోని బిఎన్ఆర్ ఫౌండేషన్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కంచరపాలెం జోన్ నాయకులు భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జోన్ సెక్రటరీ కెవై.కుమార్, జోన్ ప్రెసిడెంట్ కెటిఇ.కుమార్ పాల్గొన్నారు.

**సీతమ్మధార** : హెచ్‌బి కాలనీ లాస్ట్ బస్టాపు వద్ద అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యాన భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్.మధురెడ్డి, డి.లక్ష్మణ్‌రెడ్డి, రావి అశోక్ పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల రజతోత్సవ కలయిక

పాతికేళ్ల తర్వాత ఆత్మీక కలయికలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

**ప్రజాశక్తి-అనకాపల్లి:** అనకాపల్లి వర్తక సంఘ అనుబంధ ఎఎంఎఎల్ కళాశాల 1996- 99 డిగ్రీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల రజతోత్సవ ఆత్మీయ కలయిక ఆదివారం ఉత్సాహంగా జరిగింది. కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్‌లో పూర్వ విద్యార్థులందరూ పాతికేళ్ల తర్వాత కలుసుకొని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆనాటి విద్యాభ్యాస సమయంలో గడిచిన మధుర క్షణాలను నెమరు వేసుకొని ఆనందించారు. అనంతరం తమకు విద్యను బోధించిన అధ్యాపకులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, జ్ఞాపికలు బహుకరించి, శాలువాతో సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

**ప్రాథమిక స్థాయి నుంచి నైతిక విలువలు బోధించాలి**

ఆత్మీయ కలయికలో పాల్గొన్న విశ్రాంత ఎకనామిక్స్ అధ్యాపకులు అప్పల ఆదినారాయణ, పైడిరాజు హిస్టరీ లెక్చరర్స్ మారేశ్వర రావు, నాగేశ్వరరావు, విజయకుమారి, పాలిటిక్స్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత, నైతిక విలువలు లోపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ సైన్సెస్‌ను నిర్లక్ష్యం చేయడమే దీనికి కారణమన్నారు. ప్రాథమిక విద్య స్థాయి నుంచి సోషల్ సైన్సెస్‌కు ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులలో నైతిక విలువలు, దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందించేలా విద్యా బోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న కాలానుగుణంగా పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్ది ప్రయోజకులను చేయాలని ఆకాంక్షించారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సామ్యవాదం, ఫెడలిజం నేడు ప్రమాదంలో పడ్డాయని, వాటి రక్షించుకోవాలని హితబోధ చేశారు. అనకాపల్లి ఎంఎఎల్ కళాశాలలో ఇప్పటి వరకువిద్యాభ్యాసం చేసిన ఆర్ట్స్ విద్యార్థులలో మొట్టమొదటిసారిగా ఆత్మీయ సమావేశం పెట్టి గురువులను సత్కరించిన బ్యాచ్ మీదేనని అధ్యాపకులు అభినందించారు. అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

**పట్టించుకోకుండా రహదారి నిర్మాణం**

**అధికారుల తీరుతో విస్తుపోతున్న జనం**

తమ్మయ్యపేట వద్ద రహదారి మధ్యలో విద్యుత్ స్తంభం

**ప్రజాశక్తి - అచ్యుతాపురం** : సానికాలువ జంక్షన్ నుండి మడుతూరు వరకు నిర్మిస్తున్న రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. గాజువాక ఎలమంచిలి రోడ్డు నుండి సాని కాలువ జంక్షన్ నుండి వయా తమ్మయ్యపేట ,పిల్లోడుపాలెం, మడుతురు వెళ్లే రహదారిలో తమ్మయ్యపేట దగ్గర విద్యుత్ స్తంభం రోడ్డు మధ్యలో ఉంది. విద్యుత్ స్తంభం తీయకుండా తారురోడ్డు నిర్మిస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల తీరును చూసి జనం విస్తుబోతున్నారు. వెంటనే స్తంభాన్ని తొలగించి రోడ్డు నిర్మాణ పనులు కొనసాగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు సత్కారం

ఉద్యోగులను సత్కరిస్తున్న మాజీ సర్పంచ్, తదితరులు

**ప్రజాశక్తి -ఎస్ రాయవరం** : మండలంలోని గుర్రాజుపేట గ్రామంలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన పలువురిని మాజీ సర్పంచ్ కురందాసు శ్రీనివాసు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం గగనమౌతున్న పరిస్థితుల్లో తమ గ్రామం నుంచి పలువురు ఉద్యోగాలను సంపాదించడం హర్షనీయమన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని, బాగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాగి రామరాజు, పూర్వ హెచ్ఎం ధర్మారావు, ప్రస్తుత హెచ్ఎం అప్పారావు, టీచర్లు కొండయ్య, సింహాచలం, రాజా రమేష్, ఈగల తాతారావు, గొంప బుజ్జి, గొంప నాగేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ కొర్ని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా
## కరపత్రాల ప్రచారం

కరపత్రాలిచ్చి అవగాహనక ల్పిస్తున్న ఉమాదేవి

**ప్రజాశక్తి -ఎస్ రాయవరం :** నక్కపల్లి, యస్ రాయవరం మండలాల్లో నిర్మించతలపెట్టిన బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు నిలుపుదల చేయాలంటూ వైసిపి సీనియర్ నేత దాట్ల ఉమాదేవి కరపత్రాల పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం అడ్డరోడ్డు కల్యాణమండపంలో జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో గుర్రాజుపేట గ్రామప్రజల తరుపున పార్టీ శ్రేణులకు వీటిని అందజేసి, బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుతో కలిగే కష్టాలను వివరించారు.

నక్కపల్లి, యస్ రాయవరం మండలాల్లో 1270.80 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్‌తో ఇక్కడి ప్రజల మనుగడ ప్రశ్నార్ధకమౌతుందనే ఆవేదనతో గతనెల 6న ప్రజాభిప్రాయ సేకరణలో ముక్తకంఠంతో వ్యతిరేకించామని, అయినా ప్రభుత్వం దూకుడుగా ముందుకు వెళ్లడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి భూమి, ప్రజలు, పర్యావరణం పరిరక్షించబడి, భవిష్యత్‌లో ప్రజలు మనుగడ సాగించాలంటే బల్క్ డ్రగ్ పార్కును అడ్డుకోవడం ఒక్కటే మార్గమని ఉమాదేవి అందరికీ వివరించారు.

### డాక్టర్ జికెడి ప్రసాద్‌కు
## జాషువా పురస్కారం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:** ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న డాక్టర్ జికెడి ప్రసాదరావుకు ఈ ఏడాది గుర్రం జాషువా రాష్ట్ర పురస్కారం లభించింది. విజయవాడలోని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్‌లో పింగళి వెంకయ్య సభావేదికపై రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. రూ.50 వేల నగదు, ప్రశంసాపత్రం అందించారు. డాక్టర్ ప్రసాదరావు 2011లో 'దళిత జర్నలిజం' గ్రంథం, దేశంలో దళిత ప్రశ్నకు సంబంధించిన వ్యాససంపుటి 'సామాజిక'ను 2015లో వెలువరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సృజనశాఖ కార్యనిర్వాహక సంచాలకులు ఆర్.మల్లికార్జునరావు, విజయవాడ కలెక్టర్ ఎస్‌పి షా, చైర్మన్ పొడపాటి తేజస్విని, ఇతర చైర్మన్లు, రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి ప్రయాణం అవస్థలమయం

- దసరాకు పెరిగిన ప్రయాణికుల తాకిడి
- చాలీచాలని బస్సులతో రాకపోకలకు ఇక్కట్లు
- ఉచిత ప్రయాణమైనా సౌకర్యాల్లేక అవస్థలు

అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

**ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్** : జిల్లాలో ఆర్‌టిసి ప్రయాణికులకు దసరా పండుగ మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టింది. స్త్రీశక్తి పథకం అమలు తర్వాత ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా తగినన్ని బస్సులు లేకపోవడంతో ఇప్పటికే అవస్థలు పడుతున్న ప్రజలకు ఇపుడు దసరా పండుగతో ప్రయాణం కష్టసాధ్యమవుతోంది. దసరా పండుగ నేపథ్యంలో సెలవులు రావడంతో ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. సొంతూళ్లకు వచ్చిపోయే వారితో బస్‌స్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. బస్సుల్లో . స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా ప్రయాణికులంతా సీట్లు దొరకక పోగా, కిక్కిరిసిన బస్సుల్లో ఒంటికాలిపై నిలబడి ప్రయాణాలు చేసే పరిస్థితులు నెలకొన్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చిన్నపిల్లలు, వృద్ధులతోపాటు మహిళ, ఇతరత్రా సాదారణ ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

అనకాపల్లి జిల్లా కేంద్రం నుంచి విజయనగరం, విశాఖపట్నం, పాయకరావుపేట, చోడవరం, నర్సీపట్నం ప్రాంతాలతోపాటు సుదూర ప్రాంతాలకు, అంతర రాష్ట్ర ప్రాంతాలకు బస్సుల రాకపోకలు సాగుతుంటాయి.. అయితే ఇక్కడి డిపోకు కేటాయించబడినవి కేవలం 95 బస్సులే. ప్రయాణికుల తాకిడికి సరిపడా సంఖ్యలో బస్సులు సమకూర్చలేని పరిస్థితి స్థానిక ఆర్‌టిసి యంత్రాంగానికి నెలకొంది. రద్దీని నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చూస్తున్నా వీలుకాని పరిస్థితి ఉందని బస్‌స్టాండ్లలో ఉన్న రద్దీని చూస్తుంటే స్పష్టమౌతోంది. ప్రస్తుతం దసరా సందర్భంలో కాకున్నా, తర్వాతైనా రద్దీని తట్టుకోవాలంటే మరిన్ని కొత్త బస్సులు కేటాయించాల్సిన అవసరం ఉందని, అపుడే సమస్యకు శాశ్వతంగా పరిష్కారం వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇదే సమయంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే సరిపోదని,. సమయానికి బస్సులు లేకపోవడంతో సమయభావంతో పాటు అదనపు ఆర్థిక భారాన్ని కూడా మోయాల్సి వస్తోందని మరికొందరు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సమయానికి బస్సు లేదు

విజయవాడ నుంచి రైలులో వచ్చాను. చోడవరం వెళ్ళడానికి బస్ కోసం చాలాసేపు నిరీక్షిస్తున్నాను. బస్సులో రద్దీతో ఎక్కాలంటే భయమేస్తుంది. బస్సుల సంఖ్య కూడా మునుపటి లా లేనట్టు అనిపిస్తోంది.

- జాన్, ప్రయాణికుడు,చోడవరం

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం

బస్సుల్లో ప్రయాణికుల తాకిడికి తగ్గట్లు బస్సులు లేవు. అయితే ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. బడి బస్సులను దసరా సెలవుల్లో వినియోగిస్తున్నాం. భవానీల యాత్రకు కూడా స్పెషల్ బస్సులు వేస్తున్నాం. సమయాన్ని బట్టి, రద్దీ రూట్లలో బస్సులు సర్దుబాటు చేస్తున్నాం.

-ప్రవీణ,
జిల్లా ప్రజా రవాణా అధికారి, అనకాపల్లి

### బస్సుల సంఖ్య పెంచాలి

దసరా అంటేనే ప్రయాణ రద్దీ పెరుగుతుంది. ఫ్రీ పథకంతో మాములుగానే బస్సుల్లో ప్రయాణ తాకిడి ఎక్కువైంది. సకాలంలో బస్సుల్లేక నిరీక్షణ ఇబ్బందిగా ఉంది. బస్‌ల సంఖ్య పెంచాలి.

- సంధ్య, ప్రయాణికురాలు, అలమండ

## అమృతఫల రైతు సంఘం నూతన కార్యవర్గం

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నూతన కార్యవర్గం

**ప్రజాశక్తి -సబ్బవరం** : మండలంలోని జాగృతి స్వచ్ఛందసంస్థకు అనుబంధంగా నిర్వహిస్తున్న అమృతఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ 8వ సర్వసభ్య మహాజనసభ ఆదివారం సంస్థ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కందర్ప రామకృష్ణ 60వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానిన ఆవిష్కరించి, పూలమాలలు వేసి, నీరాజనాలు అర్పించారు. అనంతరం అమృతఫల రైతు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘం అధ్యక్షులుగా పొట్నూరి అప్పారావు, ఉపాధ్యక్షులుగా మజ్జి అప్పలనాయుడు, డైరెక్టర్లుగా రెసుపూడి రమణ, వెన్నెల అప్పలనాయుడు, గండ్రెడ్డి అప్పారావు, సాలపు సత్యారావు సిహెచ్. సత్యవతి, పి. రేవతి, ఎం. మమత , ఎస్. రమణమ్మ, బి. సూరిడమ్మ ఎన్నికయ్యారు.అనంతరం కొత్త అధ్యక్షుడు పొట్నూరి అప్పారావు 8 వ వార్షిక నివేదికను ఆవిష్కరించారుసంస్థ సిఇఒ కెఎల్ఎన్.మౌక్తిక గడచిన ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలు, వివిధ కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. రైతుల స్మార్ట్ బిజినెస్ కార్డులను పాలకవర్గ సభ్యులు, అధికారులు ఆవిష్కరించి, వాటి ప్రయోజనాలను వివరించారు కంపెనీ వెబ్ పేజీని ఆవిష్కరించారు. సంస్థ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని సభలో సభ్యులందరూ తీర్మానించారు.

## మెగా బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

**ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ :** రోటరీక్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. రోటరీక్లబ్ 3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.కల్యాణ చక్రవర్తి ముఖ్య అతిథిగా పాల్గొని క్లబ్ అధ్యక్షుడు చింతా నేతాజీ, సెక్రెటరీ పి.భాస్కర, నరేంద్రజగన్‌లతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ అంతర్జాతీయంగా రోటరీక్లబ్ చేస్తున్న సేవల ద్వారా కోట్లాది మందికి మేలు జరిగిందన్నారు. పోలియో నివారణనిధి సేకరణలో భాగంగా రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ప్రత్యేకదృష్టి సారించి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు చింతా నేతాజీ మాట్లాడుతూ రోటరీడిస్ట్రిక్ట్ 3020 పరిధిలోని ఇచ్ఛాపురం నుండి అమరావతి వరకూ 80 క్లబ్‌ల నుండి క్రీడాకారులు ఉత్సాహంగా టోర్నమెంట్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. మహిళలు,

జ్యోతి ప్రజ్వలనతో టోర్నీ ప్రారంభిస్తున్న అతిథి

పురుషులు డబుల్స్ విభాగాలుగా జరిగే ఈ టోర్నమెంట్లో 50 టీంల మధ్య పోటీ జరుగుతుందన్నారు.ో పాస్ట్‌డిస్ట్రిక్ట్ గవర్నర్ సిహెచ్ కిషోర్‌కుమార్, పాస్ట్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ బచ్చు బ్రహ్మానందం, క్రీడా విభాగం చైర్మన్ సునీల్, కోఆర్డినేటర్ చక్రవర్తి, రోటరీ ప్రతినిధులు డాక్టర్ టి.ఎస్.రావు, డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ చైర్మన్ వరప్రసాద్,ఎండి యాసిన్ బాబా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## 'మెగా అభిమానులను బాధపెట్టకండి'

**ప్రజాశక్తి- పాయకరావుపేట:** మెగా అభిమానులను బాధ పెట్టొద్దని జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో చిరంజీవిని ఉద్దేశించి ఎమ్మెల్యే బాలకష్ణ వ్యాఖ్యలపై బాధపడుతూ, కొంతమంది మెగా అభిమానులు తమ ఆవేదనను తన దృష్టికి తెచ్చారన్నారు. బాలకృష్ణ ఏ ఉద్దేశ్యంతో మాట్లాడారోగానీ, కొంచెం సంయమనం పాటించి ఉంటే బాగుండేదన్నారు.ప్రస్తుతం రాజకీయాల్లో లేని చిరంజీవి, ఇతరులకు సాయం చేయడమే తప్ప కించపరిచే స్వభావం లేదని, అటువంటి వ్యక్తిని విమర్శించి, మెగా అభిమానుల మనసు నొప్పించవద్దని అభ్యర్థించారు.

## బొడ్డేడకు సత్కారం

**ప్రజాశక్తి -అచ్యుతాపురం :** అనకాపల్లి జిల్లా పార్లమెంటు నియోజకవర్గం సమన్వయకర్తగా నియమితులైన బొడ్డేడ ప్రసాదను అచ్యుతాపురం మండలం మల్లవరం గ్రామానికి చెందిన పార్టీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నమరాజు రవీంద్ర రాజును గజమాలతో సత్కరించారు.

## వైసిపి న్యాయ విభాగం జిల్లా అధ్యక్షునిగా స్వామి

**ప్రజాశక్తి -అనకాపల్లి రూరల్:** వైసిపి న్యాయ విభాగం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఆడారి స్వామి వీర వెంకట సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీంతో పలువురు న్యాయవాదులు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## దుర్గాదేవికి కుంకుమ పూజలు

**ప్రజాశక్తి- సబ్బవరం:** మండలంలోని అసకపల్లి పంచాయితీ శివారు గవరవానిపాలెంలో దేవి నవరాత్రులు సందర్భంగా దుర్గాదేవికి మహిళలు ఆదివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారుకార్యక్రమంలో గవర అప్పారావు మహాలక్ష్మి దంపతులు, అరుణ,రవణమ్మ, ముసలమ్మ, బలిరెడ్డి రాజీ, మహాలక్ష్మి, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భారీ లారీలతో రోడ్లు ధ్వంసం

## - ప్రయాణికులు, వాహనదారులకు తప్పని అవస్థలు

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:** భారీ వాహనాలతో రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నా అధికారులకు ఏ మాత్రం పట్టడం లేదు. 40 టన్నుల వరకు బరువు గల రాళ్ళను వేసుకొని పగలు, రాత్రి తేడా లేకుండా వందలాది వాహనాలు తిరుగుతున్నాయి. దీంతో రోడ్లు నుండి లారీల బరువును తట్టుకోలేక మట్టి పైకి లేచి పోతుంది.

మండలంలో రోడ్లు చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. ఆ రోడ్లపై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మంచిగా ఉన్న రోడ్డు సైతం లారీల లోడు లతో మరమ్మతులకు గురవుతుంది. రావికమతం, మాడుగుల మండలంలో రాళ్ల క్వారీల నుండి రాంబిల్లి మండలంలో నావెల్ బేస్ పనులకు అవసరమైన రాళ్లను ప్రతిరోజు పదుల సంఖ్యలో టిప్పర్ లారీల ద్వారా రవాణా అవుతున్నాయి. బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట, దిబ్బిడి బుచ్చయ్యపేట, రాజాం, కుంద్రం మీదుగా అనకాపల్లి నుండి బైపాస్ రోడ్డు గుండా నావెల్ బేస్‌కు రవాణా జరుగుతున్నాయి. ఒక్కొక్క లారీ 40 టన్నుల వరకు బరువు ఉండటంతో రోడ్లన్నీ గుంతలు పడుతున్నాయి. గత రెండేళ్ల క్రితం కసింకోట, బంగారమెట్ట రోడ్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలతో రోడ్డును వెడల్పు చేశారు.

మండలంలో రావికమతం- చోడవరం రోడ్డు మరమ్మతులకు గురి కావడంతో ఈ రోడ్డు గుండానే ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి సమయాలలో టిప్పర్ లారీలు తెల్లవారి వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోడ్లన్నీ మరమ్మతులకు గురవుతున్నాయి. భారీ లారీల రవాణాతో నూతనంగా నిర్మించిన ఈ రోడ్డు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన నిలిచిన భారీ లారీ

రోడ్డుపై పడిన గోయి

# పెద్ద చెరువు సుందరీకరణ జరిగేనా?

పెద్ద చెరువు

**ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్:**గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు 8 ఏళ్ల క్రితం స్థానిక పెద్ద చెరువును ట్యాంకు బండ్ మాదిరి తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఎలక్షన్లు రావడం ప్రభుత్వ మారడం జరిగింది. దీంతో, పెద్ద చెరువు సుందరీకరణ పనులు జరగలేదు. గత వైసిపి ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి పెదపడ్డేపల్లి వెళ్లే దారిలో గల చెరువు వద్ద ఆహ్లాదంగా ఉండేందుకు రోడ్డులో దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇది ప్రధాన రహదారి కాకపోవడంతో పెద్దగా ప్రచారంలో లేదు. పెద్ద చెరువు నుంచి నిత్యం అనేక వాహనాలతో పాటు తుని తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో పెద్ద చెరువు సుందరీకరణ పనులు ఎప్పుడు చేపడతారో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

121.04 ఎకరాల విస్తీర్ణం కలిగిన నర్సీపట్నం పెద్దచెరువును ట్యాంకుబండ్ పార్కు మాదిరిగా అబివృద్ధి చేయడానికి మరల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. నర్సీపట్నం-తుని రోడ్డు వెంబడి దేశనాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఇటీవల శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు రూ. 4.5 కోట్లు మంజూరు చేశారని తెలిసింది. చెరువు మధ్య భారీ విగ్రహం ఏర్పాటుకు చేపట్టాల్సిన చర్యలపై పరిశీలించారు. నర్సీపట్నాన్ని ఆనుకుని ఉన్న ఈ చెరువులో ఏడాదంతా నీరుంటుంది. దీన్ని ట్యాంకు బండ్ పార్కు మాదిరి అభివృద్ధి చేయాలన్నది అయ్యన్న కల. 2018లోనే ఇందుకు నిధులు మంజూరు చేయించారు. భూగర్భ పైపుల పనులు పూర్తి చేశారు. అప్పట్లో కొంతమేర వరకు పనులకు ఖర్చు చేశారు. తదుపరి అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పనులు కొనసాగించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టణ ప్రజలు సుందరీ కరణ పనులు గురించి ఎదురు చూస్తున్నారు. పెద్ద చెరువు సుందరీకరణ చేపడితే సందర్శకులకు ఆహ్లాదంతో పాటు అక్కడ ఫుడ్ కోర్టు వంటివి ఏర్పాటు చేసుకొని అనేక మంది ఉపాధి పొందవచ్చు.

పట్టణంలో సాయంత్రం వేళ సేద తీరేందుకు ఒక్క ఎన్టీఆర్ స్టేడియం తప్ప సదుపాయాలేమీ లేవు. పెద్ద చెరువు వద్ద ప్రతిపాదిత పనులన్నీ పూర్తయితే పట్టణవాసులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారికీ ఉపయుక్తంగా ఉంటుంది.

నర్సీపట్నంలో అసంపూర్తిగా నిలిచిన సబ్ ట్రెజరీ భవనం

## సబ్ ట్రెజరీ కార్యాలయాలు పూర్తయ్యేదెన్నడో ?

**ప్రజాశక్తి-నర్సీపట్నం:** గత ప్రభుత్వంలో ఒక్కో సబ్ ట్రెజరీ కార్యాలయ భవనానికి 75 లక్షల చొప్పున మంజూరు చేసినా నేటికీ పూర్తి కాకపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. కోటవురట్ల సబ్ ట్రెజరీ కార్యాలయం శ్లాబులో ప్లాస్టరింగ్ పూర్తి కాగా వైరింగ్, ఫ్లోరింగ్, ప్లంబింగ్ పనులు చేయాల్సి ఉంది. నర్సీపట్నం సబ్ ట్రెజరీ కార్యాలయం మాత్రం శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. నేటికీ భవనాలకు బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచి పోయినట్లు గుత్తేదారులు వాపోతున్నారు.కోటవురట్ల సబ్ ట్రెజరీ కార్యాలయం అద్దె కొంపన కొనసాగుతుండగా, నర్సీపట్నం సబ్ ట్రెజరీ కార్యాలయం మాత్రం శిథిల భవనంలో కొనసాగుతోంది. వర్షం వస్తే రికార్డులు తడిచి పోతున్నాయి. 2023లో ప్రారంభమైన పనులు నేటికీ ఓ కొలిక్కి రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సకాలంలో బిల్లులు చెల్లించి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

కోటవురట్లలో అసంపూర్తిగా ఉన్న భవనం

## గంజాయి సాగు చేపట్టొద్దు

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:**మండలంలోనీ అతి మారుమూల ప్రాంత గ్రామ పంచాయతీ లక్ష్మీపురం పరిధిలోని సుత్తిగూడ గ్రామంలో ఎస్పి అమిత్ బర్దర్, డి.ఎస్.పి షేక్ షహబాజ్ అహమ్మద్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి సాగు నిర్మూలనకు ప్రభుత్వానికి సహకరించినందుకు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. గంజాయి రవాణా, క్రయవిక్రయాల జోలికి వెళ్ళవద్దన్నారు. సుత్తిగూడ విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. మహిళలు గ్రామ సమస్యలపై విన్నవించారు.

బోనాలు ఊరేగిస్తున్న భక్తులు

## ఉపమాకలో వైభవంగా బోనాల పండగ

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలోని ఉపమాక గ్రామంలో దుర్గా భవాని పీఠం గురు భవానీ దవరసింగి రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం బోనాలు పండుగ వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భవాని దీక్షాపరులు తరలివచ్చి బోనాల సంబరంలో పాల్గొన్నారు. అమ్మవారి ఘటాన్ని, చిత్రపటాన్ని, బోనాలను గ్రామంలో ఊరేగించారు. దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భవాని పీఠం వద్ద ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురు భవానీలు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# వైసిపి డిజిటల్ బుక్‌ల ఆవిష్కరణ

చోడవరంలో డిజిటల్ కోడ్ ను ఆవిష్కరిస్తున్న అమర్నాథ్

**ప్రజాశక్తి -చోడవరం**:కూటమి కక్షపూరిత రాజకీయాలతో ఇబ్బందులు పడుతున్న కార్యకర్తలను కాపాడుకోవడంలో వైసిసి ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు ఆదివారం పార్టీ కార్యాలయంలో క్యూఆర్ కోడ్ బ్రోచరు, డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి నేతలకు రాజకీయంగా ఇబ్బందులు, సమస్యలు ఉత్పన్నమైతే వాటిని క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేసి రిజిస్టర్ చేయాలని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిపై కఠినచర్యలు ఉంటాయన్నారు. గోవాడ ఫ్యాక్టరీని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, రహదారి వంతెనలు కూలిపోయి, బిఎన్ రోడ్డు అధ్వానస్థితితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే దిక్కులేదన్నారు. ప్రజాసమస్యలపై వచ్చేనెల 6 నుంచి గ్రామాల్లో ప్రచారం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏరువాక సత్య రావు, పల్లా నర్సింగరావు, బుడ్డోడు సూర్యనారాయణ, జెడ్‌పిటిసి దొండ రాంబాబు, దొండ నారాయణమూర్తి, మారిశెట్టి విజయ శ్రీకాంత్, ఎంపిపి గాడి కాసులమ్మ, జిల్లా యూత్ ప్రెసిడెంట్ పుల్లేటి వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వీర వెంకట సత్యనారాయణ నెహ్రూ పాల్గొన్నారు.

**ఎస్ రాయవరం :** మండలంలో అడ్డురోడ్డులో వైసిపి విస్తృతస్థాయి సమావేశంలో డిజిటల్ బుక్‌ను ఎడు గుడివాడ అమరనాథ్ ఆవిష్కరించారు. అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌ఛార్జి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ వైసిపికి కంచుకోట ఎస్.రాయవరం మండలంలో పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉండాలన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు మాట్లాడుతూ పార్టీలో ఎవరికి ఎటువంటి కష్టమొచ్చినా అండగా ఉంటుందన్నారు. యలమంచిలి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ డిజిటల్ బుక్‌తో ప్రతి కార్యకర్తకు బలం చేకూరిందన్నారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానాల అమలులో ప్రజలకు వైసిపి అండగా ఉంటుందన్నారు.అనంతరం ఎస్.రాయవరం మండల అధ్యక్షునిగా మధువర్మను జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్ ప్రకటించారు.సమావేశంలో పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమవతి,ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణ రాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ పాల్గొన్నారు.

నర్సీపట్నంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

**నర్సీపట్నంటౌన్:**నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆదివారం డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకుడు చిక్కాల రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులపై జరిగిన దాడులు, అక్రమ కేసులకు సంబంధించి డిజిటల్ బుక్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

# యువత ఉపాధికి ఉద్యమిద్దాం : డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి -ములగాడ :** ఉపాధి కోసం ఉద్యమిద్దామని డివైఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ విశాఖ జిల్లా 16వ మహాసభల సందర్భంగా మల్కాపురంలో 60వ వార్డు పరిధి కోరమండల్ గేట్ నుండి మల్కాపురం వరకు ర్యాలీ నిర్వహించారు. మల్కాపురం సిఐటియు కార్యాలయం వద్ద పతాకాన్ని డివైఎఫ్ఐ మల్కాపురం జోన్ పూర్వ కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ ఎగురవేశారు. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా ఎస్.వాసుశ్రావణ్‌కుమార్, శైలజ వ్యవహరించారు. భారత స్వాతంత్ర పోరాట యోధులు భగత్ సింగ్. మన్య వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి పూలమాలలువేసి నివాళులర్పించారు. గత మూడేళ్ల నివేదికను కార్యదర్శి సంతోష్ ప్రవేశపెట్టారు. నివేదికను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న హాజరై మాట్లాడుతూ, యువతకు ఉపాధి కోసం జాబ్ క్యాలెండర్ ఇవ్వాలన్నారు. రానున్న కాలంలో నిరుద్యోగంపై డివైఎఫ్ఐ పనిచేస్తుందని చెప్పారు. యువత ఉపాధిని దెబ్బతీయటానికి 13 గంటల పని విధానం తెస్తున్నారా అని ప్రశ్నించారు. భగత్ సింగ్ స్ఫూర్తితో డివైఎఫ్ఐ యువత కోసం, వారి హక్కుల కోసం పనిచేస్తుందని చెప్పారు. పరిశ్రమలలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు మాట్లాడుతూ, మతోన్మాద చర్యలను ఆర్ఎస్ఎస్ విడనాడాలని కోరారు. బిజెపి ప్రభుత్వం కోట్ల ఉద్యోగాలు ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీలలో సమస్యలపైనా డివైఎఫ్ఐ పని చేస్తుందని చెప్పారు.

అనంతరం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని, శ్రీహరిపురం గుల్లలపాలెం హాస్పిటల్ వంద పడకలుగా మార్చాలని, గోపాలపట్నం పంచ గ్రామాల భూసమస్యను పరిష్కరించాలని, జిల్లా గ్రంథాలయాన్ని యువతకు అందుబాటులో ఉంచి అభివృద్ధి చేయాలని, 13 గంటల పనిదినాలను ఉపసంహరించుకోవాలని జిల్లా నాయకులు బూడి శ్రీను తీర్మానాలు ప్రవేశపెట్టిగా ఎస్.వాసు బలపరిచారు. తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాయుడు, జెవివి కార్యదర్శి పరుశురాం, ఐద్వా రాష్ట్ర నాయకులు ఆర్.విమల, సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి లక్ష్మణమూర్తి, ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.చంటి మహాసభలో పాల్గొని సందేశాన్ని ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు.

డివైఎఫ్ఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి రామన్న

## నూతన కమిటీ ఎన్నిక

డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులుగా యుఎస్ఎన్.రాజు, కార్యదర్శిగా కె.మహేష్, ఉపాధ్యక్షులుగా శ్రావణ్, ఎస్.వాసు, గణేష్, సహాయ కార్యదర్శులుగా బూడి శ్రీను, రవి, ప్రభు, రాము, శ్యామ్, అప్పలరాజు, కమిటీ సభ్యులుగా సమీన్, సుభాన్, శరత్‌ప్రసాద్, హరిత, పోతయ్య, అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, కె.మహేష్

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, నాయకులు

బల్క్‌డ్రగ్ ఏర్పాటుపై

## కొనసాగిన మత్స్యకారుల రిలే దీక్ష

**ప్రజాశక్తి -నక్కపల్లి:** తమ జీవనోపాధిని దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును నిలుపుదల చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు ఆదివారం నాటికి 15వ రోజుకు చేరింది. వైసీపీ నేత వీసం రామకృష్ణ, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ మత్స్యకారుల ఉద్యమానికి సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసం రామకృష్ణ మాట్లాడుతూ, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేయడంతో మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. మత్స్యకారుల ఉపాధిని, ఉనికిని దెబ్బ తీస్తుందన్నారు. మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే బల్క్ డ్రగ్ ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. బల్క్ డ్రగ్ నిలుపుదల చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు. తాము తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజల మద్దతును ప్రకటించి ఆందోళనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తూ పలు గ్రామాల్లో కరపత్రాలను మత్స్యకారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పిక్కి సోమేశ్వరరావు, కాశీ రావు, పిక్కి గంగరాజు, బాలాజీ పాల్గొన్నారు.

## వైభవంగా వెంకన్న తిరువీధి సేవ

**ప్రజాశక్తి -నక్కపల్లి:** ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమా చార్యులు శేషా చార్యులు, గోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులను సప్పరం వాహనంలో అధిష్టింపజేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఊరేగిస్తున్న అర్చకులు

## మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సిపి

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :** మహారాణిపేట పోలీసుస్టేషన్ (లా అండ్ ఆర్డర్)ను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్ మొత్తం పరిశీలించి, కేసుల ఫైళ్లను నిశితంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించి ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా, శుభ్రం చేయించి,మొక్కలు నాటాలని ఆదేశించారు.

## నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** గుర్రంజాషువా జయంతి సందర్భంగా, ఆదివారం బీచ్‌రోడ్‌లో ఉన్న గుర్రంజాషువా విగ్రహానికి దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవి కోకిలగా, నవయుగ కవిత చక్రవర్తిగా పేరుగాంచిన గుర్రం జాషువా తన రచనల ద్వారా సమాజంలో మార్పు తీసుకొచ్చిన గొప్ప యోధుడని తెలిపారు. 1964లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనను 'కళాప్రపూర్ణ' గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడంతో పాటు, భారత ప్రభుత్వం 1970లో ఆయనకు పద్మభూషణ్‌ను ప్రదానం చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉపకార వేతనాలు

స్కాలర్ షిప్‌లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కొణతాల

**ప్రజాశక్తి-అనకాపల్లి :** గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు ఆదివారం ఉపకార వేతనాలను అందజేశారు. అనకాపల్లి నిదానందొడ్డి గవరపాలెం కొణతాల సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణ మండపంలో స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వళనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గౌరీ సేవా సంఘం ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నాలుగు తరాలుగా విద్యార్థులను ప్రతిభను గుర్తించి ప్రోత్సాహించే కార్యక్రమాలను గౌరీసేవా సంఘ కొనసాగించడం అభినందనీయమన్నారు. ఎన్నో ఏళ్లుగా విద్య, వైద్య కార్యక్రమాలకు అనకాపల్లి వర్తకసంఘం తోడ్పాటునందిస్తోందన్నారు. బాలికలు, మహిళల విద్యకు ప్రత్యేకంగా మహిళా కళాశాల ప్రారంభించి తోడ్పాటు నందించడం వల్లే నేడు ఇక్కడి ఆడపిల్లలు ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్ ఐటీ, మెడికల్, ఇంజనీరింగ్ విభాగాల్లో రాణిస్తున్నారన్నారు.

కౌలు రైతులకూ

# అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** అన్నదాత సుఖీభవ పథకం కౌలురైతులకూ వర్తింపచేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. శాసనసభ సమావేశాల్లో మాట్లాడుతూ, వాస్తవ సాగు దారులను ఆదుకోవాలనే ఆలోచనతో పెట్టుబడి సాయంగా రైతులకు ఏటా ఇచ్చే రూ. 20 వేలను కౌలుదారులకు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రైతు ఆత్మహత్యల్లో కౌలుదారులే ఎక్కువగా ఉన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే జనసేన అధినేతగా ప్రస్తుత డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అప్పట్లోనే దాదాపు నాలుగు వేలమందికి ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున రూ.40కోట్ల సొంత నిధులను ఇచ్చిన ఆదుకున్న సందర్భాలున్నాయన్నారు.కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ప్రభుత్వ రాయితీలను భూయజమాని ప్రమేయం లేకుండా రెవెన్యూ, వ్యవసాయ అధికారుల ధ్రువీకరణతో అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలన్నారు. కొణతాల ప్రశ్నకు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రెండో విడతలో కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సాయం అందించడానికి రూ.430కోట్ల నిధులు విడుదల చేస్తున్నామన్నారు. గుర్తింపు కార్డులిచ్చి, తర్వాత అన్నదాత సుఖీభవ అందజేస్తామన్నారు. దీనిపై వ్యవసాయశాఖమంత్రికి, కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే కొణతాల ధన్యవాదాలు తెలిపారు.

# నేడు పిఏసిఎస్‌ల సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి -అచ్యుతాపురం :** మండలంలో తిమ్మరాజుపేట దుప్పతూరు పిఏసిఎస్‌ల సర్వసభ్య సమావేశాలు సోమవారం నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శులు ఐఎస్ మహేశ్వరరావు, ఆర్ శంకరరావు తెలిపారు. తిమ్మరాజుపేట పిఏసిఎస్ సమావేశం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమవుతుందని సంఘ కార్యదర్శి తెలిపారు. దుప్పుతురు పిఏసిఎస్ సర్వసభ్య సమావేశం ఉదయం 11:30 గంటలకు ప్రారంభమవుతుందని సంఘ కార్యదర్శి తెలిపారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

| | | | |
|---|---|---|---|
| సిటీ | 9490099125 | పూర్ణమార్కెట్ | 9490099676 |
| మధురవాడ | 8008596645 | జగదాంబ | 9490099434 |
| గాజువాక | 9849392359 | జివియంసి | 9490099483 |
| అనకాపల్లి | 8008736188 | ద్వారకానగర్ | 9490099672 |
| చోడవరం | 9490099141 | కంచరపాలెం | 9490099135 |
| నర్సీపట్నం | 9440280411 | మాదవధార | 9490099675 |
| పాడేరు | 9490099142 | | |
| రంపచోడవరం | 9440165617 | | |